# నవోదయం





శిరిపురపు రాధాకృష్ణ

# నవోదయం

**ధృఢ సంకల్పం వుంటే మనిషి సాధించలేనిది ఏదీ వుండదనే సూత్రాన్ని నమ్మిన ఒక యువకుని కథ ఇది. యుక్త వయసులో సర్వసాధారణంగా ఎదురయ్యే శారీరిక, మానసిక బలహీనతలకు అతీతంగా నిలబడి, తనకై తాను నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించటంలో సఫలీకృతుడైన ఒక యువకుని కథ ఇది. ప్రతి యువకుడు తన జీవితంలో ఎదుర్కొనే ప్రేమ, పెళ్లి, కుటుంబ పరువు ప్రతిష్టలతో ముడిపడిన మానసిక సంఘర్షణలు ఈ కథలోనూ వున్నాయి. అలాగని చెప్పి తన లక్ష్య సాధనలో అవేవీ అడ్డంకి కాలేదు ఆ యువకునికి. ఇక చదవండి ఈ కథని.**

***

**ఓం భూః | ఓం భువః | ఓగ్ం సువః | ఓం మహః | ఓం జనః | ఓం తపః | ఓగ్ం సత్యమ్ |**

**ఓం తథ్స'వితుర్వరేణ్యం భర్గో' దేవస్య ధీమహి |**

**ధియో యోనః' ప్రచోదయాత్ ||**

**ఓమాపో జ్యోతీ రసో౭మృతం బ్రహ్మ భూర్భువస్సువరోమ్**

ప్రాతః కాల సమయంలో ఆ గ్రామంలోని తూర్పు వీధిలో ఉన్న పెద్ద మండువా లోగిలి నుండి సుమారు 25 మంది చిన్నపిల్లలు రిథమిక్ గా సాధన చేస్తున్న గాయత్రీ మంత్రం కర్ణపేయంగా వినబడుతున్నది. పాతకాలం నాటి పడకకుర్చీలో కూర్చొని ఉన్న ఒక పెద్దాయన పిల్లలను గమనిస్తూ వారు వల్లెవేస్తున్న మంత్రాన్ని శ్రద్ధగా వింటున్నాడు. ఆయన ఆరు అడుగుల ఆజానుబాహుడు, ఏబది నిండి అరవయ్యో పడిలో పడ్డున్నాడు. ఆయన పేరు గౌరీపతి సోమయాజి. ఆయనది చెక్కు చెదరని శారీరిక దారుఢ్యం. దబ్బపండు చాయ, విశాల ఫాలభాగంపై విభూది రేఖలు, కుంకుమ బొట్టు, ముఖంలో తేజస్సు, కళ్ళలో ఆత్మ విశ్వాసం,

కరుణ తొణికిసలాడుతుంటాయి. ఆయన చతుర్వేదాల ఘనాపాఠి, ఉపనిషత్తులను ఔపోసన పట్టినవాడు. నిత్యాగ్నిహోత్రుడు, నిత్యానుస్టానపరుడు. గంభీర స్వరంతో, స్వచ్ఛమైన ఉచ్ఛారణతో ఆయన వేద మంత్రాల్ని పిల్లలు నేర్పేటప్పుడు ఆయా పిల్లల తల్లితండ్రులు అది వింటూ మైమరిచి పోతుంటారు. ఆయనకు పాదాభివందనం చేసి శలవు తీసుకోవటం పరిపాటి.

ఆ అగ్రహారంలోని ఐదు బ్రాహ్మణ వీధుల్లో గృహ పంచక సముదాయాలున్నాయి. ఒక్కోవీధిలో ఐదేసి గృహాలు, ప్రతి పంచకంలోనూ ఒకే రకమైన నిర్మాణం శైలితో పెద్ద పెద్ద మండువా లోగిళ్లు, ఇంటికి పెంకుల పైకప్పు, ప్రతి ఇంటికి ప్రహరీ గోడ, లోపల పెద్ద వరండా, దేవతా మూర్తుల బొమ్మలు చెక్కిన ద్వారబందాలు, విశాలమైన కిటికీలు, ఇంటి వెనక భాగంలో మంచినీటి బావి, దానికి ముందు పెద్ద తులసికోట, పెరట్లో నందివర్ధనం, మందారం, గన్నేరు, గోరింట, రుద్రాక్ష, మల్లి, జాజి పూల మొక్కలు, మామిడి, మారేడు, ఉసిరి, రేగు, జామ, అరటి చెట్లు, ఆ చెట్లకు నీరు పారేందుకు నూతిగట్టు నుంచి పిల్ల కాలువలు ఉన్నాయి. ఈ గృహ నిర్మాణ శైలి ఆంధ్ర రాష్ట్రంలో మరెక్కడా కనిపించదు.

ఆ అగ్రహారం వీధుల్లో అడుగుపెట్టిన వాళ్ళకి ప్రతి ఇంటి నుండి వేద మంత్రాలు వినబడతాయి. రోజులు మారినా, ఆ వూరి తీరు మారలేదు. తరాలు మారినా ఈ వీధుల్లోని కుటుంబాలు వారి పూర్వీకుల నాటి సంస్కృతి, సాంప్రదాయాలను విడిచి పెట్టలేదు. వందల ఏళ్ల కాలంనాటి మండువా లోగిళ్లు అలాగే ఉన్నాయి.

ఆ ఊరి పేరు పేరూరు అగ్రహారం. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి పట్టణానికి 35 మైళ్ళు, కాకినాడకి 38 మైళ్ళ దూరం, అమలాపురం పట్టణానికి 3 మైళ్ళ దూరంలో ఉన్న

పురాతన గ్రామం అది. దగ్గరలో పారుతున్న గోదావరి, అత్యంత చేరువలో సముద్రం. ఎటు చూసిన పచ్చదనంతో ఆహ్లాదభరితమైన వాతావరణం కలిగిన ఈ గ్రామానికి శతాబ్దాల చరిత్ర ఉంది. క్రీ.శ. 1053 వ సంవత్సరంలో చాళుక్య రాజు రాజేంద్రచోళుడు రాజమహేంద్రవరం రాజైన రాజరాజ నరేంద్రునికి తన రెండవ కుమార్తె ఆనంగదేవినిచ్చి పెళ్లి చేశాడని చరిత్ర చెపుతోంది. తన కుమార్తెకు చీర, సారెలతో పాటు, తంజావూరు మండలం పెరియావూరికి చెందిన పదునెనిమిది ద్రావిడ శాఖ బ్రాహ్మణ వేదపండితుల కుటుంబాలను కూడా ఆమె వెంట అరణం పంపినట్లు స్థల పురాణం చెపుతోంది. ఆ విధంగా వచ్చిన బ్రాహ్మణ కుటుంబాలలో కొన్ని రాజరాజ నరేంద్రుని రాజ్యంలోని ర్యాలీ గ్రామంలోనూ, అమలాపురం దగ్గరి నేటి పేరూరులోనూ స్థిరపడ్డాయిట. ఇంకో మైలు దూరంలో బండి అగ్రహారం, విశ్వేశ్వరుడి అగ్రహారం లోనూ కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు స్థిర పడినట్లు స్థానికుల కథనం.

పేరూరు అగ్రహారంలో ఉమా సోమేశ్వరస్వామి, లక్ష్మీ నరసింహస్వామి, మదన గోపాలస్వామి కోవెలలు గత 500 ఏండ్లుగా వున్నాయి. ఈ దేవాలయాలను దత్త, పుష్పగిరి, శృంగేరీ, కంచి, హరిహర, విరూపాక్ష పీఠాధిపతులు దర్శించి స్వామివార్లకి పూజలు చేసినట్లు తెలుస్తోంది. అంతటి ప్రఖ్యాతి చెందిన ఈ మూడు కోవెలలో ప్రతి రోజు ఉదయమే జరిగే నిత్యపూజలు ఈ గ్రామంలో ఒక పవిత్రమైన అధ్యాత్మిక సౌరభాన్ని వెదజల్లుతుంటాయి.

అందుకే ఈ వూరిని "heritage village" గా ప్రభుత్వం గుర్తించింది. ఆంధ్ర రాష్ట్రంలో మరెక్కడా ఇలాంటి సనాతన గ్రామం మనకు కనపడదు.

తమిళనాడు నుండి వలసవచ్చిన ఈ ద్రావిడశాఖ బ్రాహ్మణ కుటుంబాల వారు వేదాల్లో పండితులు. నిత్యాగ్నిహోత్రులు. వారు కాలక్రమీణా పేరూరు ద్రావిడులుగా పేరుపొందారు. తరాలు మారినా, రోజులు మారినా, లోకం కొత్త పోకడలు పోతున్నా ఈ

కుటుంబాల జీవన విధానం మారలేదు. వాళ్ళ సాంస్కృతిక వారసత్వాన్ని వారు వదులుకోలేదు. చాలా మంది కుటుంబాల వారు పౌరోహిత్యమే వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. వేదాలకి, వేద విజ్ఞానికి గుర్తింపు లేని ఈ రోజుల్లో కూడా వారు పౌరోహిత్యం వృత్తినే నమ్ముకొని జీవిస్తున్నారు. వాళ్ళ పిల్లలు ఇంగ్లీష్ చదువులు చదువుకొని ఉద్యోగాలకోసం దూరప్రాంతాలకు వెళ్ళిపోయినా పెద్ద వాళ్ళు మాత్రం వారి సాంస్కృతిక వారసత్వాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు.

గౌరీపతి సోమయాజి తండ్రి విశ్వనాథ సోమయాజి. ఆయన సుమారు వందేళ్లు బ్రతికాడు. గ్రామంలోని ఇతర బ్రాహ్మణ కుటుంబాల్లా పౌరోహిత్యాన్ని ఆయన వృత్తిగా ఎంచుకోలేదు. ఆయన చతుర్వేదాల్లో ఘనాపాఠి. తన ఒక్కగానొక్క కుమారుడికి ఐదవ ఏటనే ఉపనయనం చేసి చతుర్వేదాలను నేర్పి వేదపండితుడిగా తీర్చిదిద్దాడు. యోగాసనాలు నేర్పాడు. గ్రామంలోని బ్రాహ్మణ పిల్లలకి వేదాలు, యోగా నేర్పే వారసత్వాన్నికుమారుడికి అప్పగించాడు. ఆయన తన కొడుక్కిచ్చిన ఆస్తి కేవలం ఒకటిన్నర ఎకరాల మాగాణీ భూమి మాత్రమే.

గౌరీపతి సోమయాజి కూడా తన తండ్రి బాటలోనే జీవన ప్రయాణం చేస్తున్నాడు. ఆయన భార్య అన్నపూర్ణ. ఉత్తమ ఇల్లాలు. చూడగానే నమస్కరించాలనిపించే రూపం ఆమెది. వారి ఒక్కగానొక్క కొడుకు రాజశేఖర సోమయాజి. పొలం మీద పెద్దగా ఆదాయం లేకున్నా పేద పిల్లల్ని చేరదీసి, తమ పిల్లలతో సమానంగా ప్రేమించి, ఆదరించే సంస్కారం ఆ దంపతులది. తమ ఇంటికి వచ్చిన వారిని కులమతాలకు అతీతంగా ఆప్యాయంగా పలకరించటం, మర్యాదలు చేయటం వారికి అలవాటు. ఆ నడవడికే ఆ దంపతులకు ప్రత్యేక గౌరవరం, గుర్తింపు తెచ్చింది.

## (2)

గౌరీపతి సోమయాజి ఆ రోజుకి పాఠాలు ముగించి పిల్లలను ఇళ్లకు పంపేసరికి మధ్యాహ్నమైంది. త్రికాలలో సంధ్య వార్చకోవటం ఆయనకి తండ్రి నేర్పిన క్రమశిక్షణ. ఆ పని ముగించుకొని భోజనానికి లేవమని భార్య చెప్పగా వెళ్ళి ఔపోసన పట్టి భోజనం ముగించాడు. భోజనం చేసేప్పుడు ఆయన ఏమీ మాట్లాడడు. భార్య అన్నపూర్ణ కూడా భోజనం చేసిన తర్వాత పడక గదికి వచ్చింది.

“ఇదిగో పూర్ణా! వచ్చే చైత్రానికి రాజశేఖరానికి ఐదో ఏడు వస్తుంది. ఉపనయనం చేసి వేదం చెప్పటం ప్రారంభిద్దామనుకుంటున్నాను. ఏమంటావు? అడిగాడు భార్యని.

“ మీలాగా ఈ వేదాలను నేర్చితే వాడికి భవిష్యత్తులో వచ్చే లాభం ఏంటి? జీవనం వెళ్తుందా? పెద్దయ్యాక ఇతర పిల్లల్లాగా ఇంగ్లిష్ చదువులు చెప్పించలేదని, అందుకే సరైన ఉద్యోగం దొరక లేదని బాధపడ్తాడు. ఆలోచించండి. పడమటివీధి సిద్ధాంతిగారు తన కొడుకుని అమలాపురం కాన్వెంట్ స్కూల్లో చేర్పించాట్ట. మనం కూడా అలా చేస్తే బాగుంటుందేమో చూడండి” అందామె.

“చూద్దాం పూర్ణా ! కుటుంబ వారసత్వంగా వస్తున్న వేదపఠనం, యోగసాధన ఎప్పుడూ మానరాదు. ఒక్కసారి స్కూల్ హెడ్మాస్టారు రమణయ్య గారిని ఈ విషయంలో సలహా అడుగుతాను. ఆ తర్వాత పిల్లాడితో మాట్లాడతాను ”అన్నాడాయన.

మరునాడు సాయంత్రం సోమేశ్వరాలయంలో కనిపించిన హెడ్ మాస్టారు రమణయ్య గారితో

“ మాస్టారూ ! మా అబ్బాయి రాజాకి మీరు ఎంతో అబిమానంతో అక్షరాభ్యాసం చేసి ప్రాథమిక విద్య నేర్పారు. ఇకపై వాడి చదువు గురించి నేను ఏం చేయాలో శలవీయండి. వాళ్ళ అమ్మేమో హైస్కూల్ చదువులకి పంపమంటున్నది.”

“ అది సరైందే సోమయాజి గారూ ! ఈ రోజుల్లో వేదాలు, యోగాసనాలు నేర్చితే చాలదు. మీ పిల్లవాడు చాలా తెలివైన వాడు. వాడికి మంచి భవిష్యత్తు ఉంది. హైస్కూలికి పంపండి. పై చదువులు కొనసాగించండి. ఇక్కడి స్కూల్ కంటే అమలాపురంలో మంచి స్కూళ్లు ఉన్నాయి. ఎటూ మీ పినతండ్రి కొడుకు అమలాపురంలో ఉన్నారు కదా. వాళ్ళ ఇంట్లో ఉంచి చదివించవచ్చు. ప్రతి రోజు పేరూరు తిరగాల్సిన అవసరం వుండదు కూడా ” అన్నాడాయన.

“ అయితే అలాగే చేస్తాను. ముందు ఉపనయనం చేయాలి. తర్వాత వేదాలు నేర్పాలి. పదో ఏట హైస్కూల్లో వేద్దాం” అంటూ గౌరీపతి సోమయాజి గారు శలవు తీసుకున్నాడు.

**(3)**

మరుసటి ఏడాది చైత్ర శుద్ధ పంచమి నాడు రాజశేఖరుడికి ఉపనయనం చేసి గాయత్రీ మంత్రోపదేశం చేశాడు గౌరీపతి సోమయాజి. యోగాసనాలు సాధన చేయించటం ప్రారంభించాడు.

“రాజా! మీ తాతగారు విశ్వనాధ సోమయాజి గారు సుప్రసిద్ధులు. వేదాల్లో ఘనాపాఠి, హఠ యోగ సాధన చేసిన వాడు. ఆయనలాగే నువ్వు కూడా చతుర్వేదాలని అభ్యసించాలి. క్రమం తప్పకుండా త్రికాలాల్లో సంధ్యవందనం చేసుకోవాలి. వేదవిజ్ఞాన్ని ఔపోసన పట్టాలి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Navodayam](http://kinige.com/book/Navodayam)**

* * *